గ్రామ వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

తిరువూరురూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందించడంలో గ్రామ వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామున వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళల ఇంటి తలుపు తట్టి మరీ పెన్షను సొమ్ము పంపిణీ చేస్తున్న వలంటీర్లు ఇతర సంక్షేమ పథకాలను కూడా ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందజేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. తిరువూరు మండలంలోని 20 గ్రామాల పరిధిలో 17 సచివాలయాల్లో 218 మంది వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన నగదు పురస్కారాలను అందజేయడంతో పాటు సన్మానం చేశారు. ఎంపీపీ గద్దల భారతి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, తహసీల్దారు సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పునాదులు వలంటీర్లు

ఆగిరిపల్లి: ప్రభుత్వానికి వలంటీర్లు పునాదులు లాంటి వారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులో గల పొన్నం కల్యాణ మండపంలో వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయా గ్రామాలకు వెళ్లినపుడు వలంటీర్లకు ప్రజల్లో ఉన్న ఆదరణ స్పష్టంగా కనపడిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ వైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులకు లంచాలు ఇచ్చే పరిస్థితి ఉండేదన్నారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలను ఎటువంటి అవినీతి లేకుండా అందజేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ప్రభుత్వంతో పాటు వలంటీర్లకు దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. మండలంలో 287 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలు, ఐదుగురికి సేవా రత్న పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను తొలగిస్తామని చెబుతున్న టీడీపీ నాయకుల మాటలు నమ్మ వద్దన్నారు. టీడీపీ మునిగిపోయే పడవ అని వారి కల్లబొల్లి మాటలు ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. అదేవిధంగా ముసూరు మండలంలోని గోపవరంలో వైఎస్సార్ సీపీకి చెందిన వారు ఎవరూ టీడీపీలోకి వెళ్లలేదని, ఆ పార్టీకి చెందిన వారే ఆ పార్టీ కండువాలు కప్పుకుని పార్టీలోకి వెళ్లినట్లు కుళ్లు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.అనూష, జెడ్పీటీసీ సభ్యుడు పి.వీరబాబు, ఎంపీడీఓ కె.వాణి, వైస్ ఎంపీపీలు సాంబశివరావు, కె.రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.నరసింహారావు పాల్గొన్నారు.



తిరువూరులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



ఆగిరిపల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



గంపలగూడెం: గంపలగూడెం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటర్లో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఖమ్మం పట్టణానికి చెందిన చారుగుండ్ల సత్యనారాయణ, శేషారత్నం కుమారుడు, కోడలు కృష్ణ పద్మజ సౌజన్యంతో 100 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు వనమా సుజాత, సభ్యులు వనమా సత్యవాణి, వజినేపల్లి మాధురి, వేములపల్లి రాణీ పాల్గొన్నారు.

రక్తదానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్యాపో సొసైటీ సభ్యులు రక్తదానం చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని సొసైటీ అధ్యక్షుడు, స్థానిక ఐదో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ తెలిపారు. విజయవాడ హెల్ప్ వైద్యశాలలో ఓ వ్యక్తికి ఏబీ పాజిటీవ్ బ్లడ్ అవసరముందని తెలియగానే సొసైటీ సభ్యుడు రమేష్ తక్షణమే వైద్యశాలకు వెళ్లి రక్తదానం చేసినట్లు తెలిపారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



కిలేశపురం(ఇబ్రహీంపట్నం): ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ సత్యప్రశాంత్ అన్నారు. కేంద్రీయ ఆయుర్వేద పరిశోధనా పరిషత్ ఆధ్వర్యంలో ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా కిలేశపురం ఎస్సీ ప్రాంతంలో బుధవారం సంచార ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేదం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. మధుమేహం, బీపీ, రక్తహీనత నిర్ధారణ పరీక్షలు సుమారు 60మందికి నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు, ఆహార నియమాలు తెలియజేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ నందిని పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం కార్యక్రమం

మైలవరం: మైలవరం శ్రీవెంకటేశ్వరస్వామివారి కల్యాణ మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జీ. వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని జి. కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం మండలాల వలంటీర్లకు సేవా పురస్కారాలను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

నేడు వలంటీర్లకు సన్మానం

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వలంటీర్లకు పురస్కారాలను గురువారం తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని వలంటీర్లకు ఎమ్మెల్యే కే రక్షణనిధి ప్రదానం చేస్తారని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలి



తిరువూరు: విద్యార్థులు మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు వల్లభనేని రవీంద్ర అన్నారు. స్థానిక సుందరయ్య భవన్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 18 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా బుధవారం బహుమతి ప్రదాన కార్యక్రమం జరిగింది.

విద్యార్థులకు అన్ని భాషల్లో నైపుణ్యం సాధించాలనే ఉద్దేశంతో వేసవి శిక్షణా కార్యక్రమాలను జేవీవీ నిర్వహిస్తోందని రవీంద్ర తెలిపారు. జేవీవీ ప్రతినిధులు గంగాధర్, హరికృష్ణ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పఠనంలో శిక్షణ

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం భగవద్గీత శ్లోకాల పఠనంపై శిక్షణ ఇచ్చారు. తెలుగుభాషా వికాస సమితి కన్వీనర్ తోట ఉమామహేశ్వరరావు భగవద్గీత ప్రాశస్త్యాన్ని వివరించారు. పెద్దలతో వ్యవహరించే విధానం, నైతిక విలువలపై అవగాహన భగవద్గీత ద్వారా పొందవచ్చని సూచించారు. గ్రంథాలయాధికారి పద్మావతి, రంగారావు, శ్రీలత పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో ఉన్న శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు జాతీయభాషపై హైస్కూల్ హిందీ ఉపాధ్యాయిని దాసరి దుర్గామల్లేశ్వరి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రోజుకొక హిందీ పదాన్ని నేర్చుకోవాలన్నారు. హిందీ భాషపై పట్టు సాధించినట్లయితే దేశంలో ఎక్కడైనా జీవించొచ్చన్నారు. హైస్కూల్ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, కృష్ణవేణి పుస్తకపఠనం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు, పీడీ రవీంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో ముగ్గురికి, సీనియర్స్ విభాగంలో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శేషిరెడ్డి, షిరిడీ సాయి సేవ సమితి సభ్యులు నారాయణరావు, ఉపాధ్యాయులు నాగరాజు, గ్రంథాలయ నిర్వహణ అధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు. గంపలగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో స్వామి వివేకానంద, టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత చరిత్ర పఠనం గావించారు. గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తిరువూరు గ్రంథాలయంలో భగవద్గీత శ్లోకాల పఠన శిక్షణ

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతిగా వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కె.చెన్నారావు రూ.15,116, ద్వితీయ బహుమతిగా ఏ.కొండూరు సర్పంచ్ వెంపాటి రజిని రూ.10,116 అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.600 ఉంటుందని నిర్వాహకులు వీ వంశీ, ఎండీ యాసీన్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం-4లో 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు గురువారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు నకలు తీసుకెళ్లి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుభార్గవి, వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, రైతు భరోసా కేంద్రాల ఎడ్వైజరీ బోర్డు చైర్మన్ సాంబశివారెడ్డి జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. తిరుపతిరావు, మైలవరం ఏఓ కే సంధ్యారాణి పాల్గొన్నారు. మైలవరం మండలం పుల్లూరు పంచాయతీ కార్యాలయంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ నాగమల్లేశ్వరి అందజేశారు.

పాడి రైతు సంక్షేమమే లక్ష్యం

చాట్రాయి: పాడి రైతుల సంక్షేమమే విజయ డెయిరీ మిల్క్ యూనియన్ ముఖ్య లక్ష్యమని ఆ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మగూడెం పాల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి మూడు దఫాలుగా బోనస్ పంపిణీ చేస్తున్నామని, పాడి రైతుల పిల్లల పెళ్లిళ్లకు కల్యాణమస్తు పథకం కింద రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు.

ప్రశాంతంగా ఏపీ ఐసెట్ పరీక్షలు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏపీ ఐసెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మొదటి విడతలో ఉదయం జరిగిన పరీక్షకు 216మంది అభ్యర్థులకు గాను 182 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. రెండో విడతలో మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 216 మంది విద్యార్థులకు గాను 194 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

తిరువూరులో..

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ ఐసెట్ 2023 పరీక్ష బుధవారం జరిగింది. రెండు సెషన్లలో 260 మందిని ఈ కేంద్రానికి కేటాయించగా, 250 మంది హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. పరీక్షలను ఏపీ ఐసెట్ పరిశీలకులు మద్దిశెట్టి, దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు పర్యవేక్షించారు.

నిరంతర సాహితీ యాత్రికుడు డాక్టర్ ఆదినారాయణ

విజయవాడ కల్చరల్: నిరంతర సాహితీ యాత్రికుడు డాక్టర్ ఆదినారాయణ అని సాహితీ విమర్శకుడు డాక్టర్ కాకుమాను శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ ఆదినారాయణ రచించిన సైబీరియా బాటసారి యాత్ర గ్రంథావిష్కరణ సభ బుధవారం గవర్నర్‌పేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ కార్యాలయంలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావేత్తగా భావిభారత పౌరులను తీర్చిదిద్దుతూ సాహిత్యరంగంలోనూ ప్రతిభను చాటుకున్నట్లు తెలిపారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన సాహితీవేత్త సూర్యకుమారి మాట్లాడుతూ ఆదినాయణ ప్రకృతి ప్రేమికుడని, గతంలో అనేక యాత్రలు చేసి గ్రంథాలను రచించినట్లు తెలిపారు. సైబీరియా బాటసారి గ్రంథంలో అక్కడి రాజకీయ సామాజిక, సాంస్కృతిక విషయాలను వివరించినట్లు తెలిపారు. సభలో వైద్యులు గుత్తా శివాజీ, న్యాయవాది చిరంజీవి, సాహిత్య సంస్థల ప్రతినిధులు ఎ.కృష్ణ, ఓరా ప్రసాద్, మందరపు హైమవతి ఆదినారాయణ సాహితీ విశేషాలను వివరించారు.



సైబీరియా బాటసారి గ్రంథావిష్కరణ సభలో రచయిత ఆదినారాయణ, రచయిత్రి సూర్యకుమారి

స్కిజోఫ్రెనియాపై అవగాహన కల్పించాలి

> డాక్టర్ అయోధ్య ఆర్.కె

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్కిజోఫ్రెనియా వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని డాక్టర్ ఆయోధ్య ఆర్.కె. అన్నారు. ప్రపంచ స్కిజోఫ్రెనియా ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మానస సైకియాట్రిక్ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ అయోధ్య ఆర్.కె. ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ బుధవారం నుంచి మానసిక ఆరోగ్యంపై ప్రధానంగా స్కిజోఫ్రెనియాపై ప్రజల్లో అవగాహన పెంచడానికి వారం పాటు వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) నిర్ణయించిందన్నారు. 24న ప్రపంచ స్కిజోఫ్రెనియా ఆరోగ్య దినంగా గుర్తించారని పేర్కొన్నారు. మానసిక వైద్యులు, సైకాలజిస్టు, సైకియాట్రిస్టులు, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం చేసి, వారాంతంలో కార్యక్రమాలను సమీక్షించుకుంటామని తెలిపారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌లో భాగంగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్ (డబ్ల్యూఎఫ్ఎంహెచ్) ఆధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రపంచంలో 0.3 నుంచి 0.7 శాతం ప్రజలు జీవిత కాలంలో స్కిజోఫ్రెనియా వ్యాధి పీడితులేనని పేర్కొన్నారు. వ్యాధి వంశపారంపర్యంగా, జీవితంలో ఎదురైన ఒడిదొడుకులు, మెదడులోని కెమికల్ ఇన్‌బ్యాలెన్స్, ఇతరత్రా కారణాలతో వస్తుందన్నారు. దీని ప్రభావం పురుషుల్లో, స్త్రీలల్లో సమానంగా ఉంటుందని తెలిపారు. స్కిజోఫ్రెనియా వ్యాధితో బాధపడేవారికి యాంటి సైకోటిక్స్ అనే మందులు వాడడం ఉత్తమమని చెప్పారు. తొలుత వ్యాధి పట్ల రోగికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన (సైకో ఎడ్యుకేషన్) కల్పించాల్సి వుంటుందన్నారు. డాక్టర్ మానస, డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అయోధ్య

సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

> డీఆర్ఎం శివేంద్రమోహన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే సిబ్బంది సంక్షేమానికి విజయవాడ డివిజన్ అధిక ప్రాధాన్యమిస్తోందని డీఆర్ఎం శివేంద్రమోహన్ పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఈటీటీసీ (ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్)లో ఆధునీకరించిన కిచెన్, డైనింగ్ హాల్, వాకింగ్ ట్రాక్‌లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణపురంలోని ఈటీటీసీ సెంటర్‌లో దక్షిణ మధ్య రైల్వేతో పాటు ఇతర జోన్లలోని రన్నింగ్, టీఆర్ఎస్, ఈఎంయూ, టీఆర్‌డీ సిబ్బందికి వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తారన్నారు. 2007 నుంచి ఇక్కడ 3-ఫేజ్ లోకోమోటివ్‌లపై కూడా లోకో పైలెట్లకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ నుంచి ఏడాదికి 7 వేల మంది లోకోపైలట్‌లు శిక్షణ పొందుతారని తెలిపారు. శిక్షణ కాలంలో వారి కోసం హాస్టల్, క్యాంటిన్ సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. వారికి మరిన్ని సౌకర్యాలు అందించడానికి రూ. 30 లక్షలతో క్యాంటిన్, డైనింగ్ హాల్‌తో పాటు 2,600 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీఈఈ కొండా శ్రీనివాసరావు, ఆర్‌సీ సాహు ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈటీటీసీలో క్యాంటిన్, డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం శివేంద్రమోహన్

బాలిక అంత్యక్రియలకు దీవెన ఫౌండేషన్ సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలిక నయోమి ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందింది. నగరానికి చెందిన దీవెన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహయాన్ని అందజేశారు. నిరుపేదలైన మృతురాలి తల్లిదండ్రులు తమ కుమార్తె అంత్యక్రియలను నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతూ దీవెన్ ఫౌండేషన్‌ను ఆశ్రయించింది. దీంతో వెంటనే స్పందించిన ఫౌండేషన్ సభ్యులు కొత్తపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌బాబు, గ్రూప్ సభ్యుడు హెడ్ కానిస్టేబుల్ సూరిబాబులు బుధవారం నగదును బాలిక తల్లిదండ్రులకు అందజేశారు.



మైనింగ్ నిర్వహణపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

వినగడప(గంపలగూడెం): గంపలగూడెం మండలం వినగడప శివారు పేరంటాళ్ల గుట్ట వద్ద నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీస్టోన్‌క్రషర్స్ నిర్వహణపై ఉన్నతాధికారులు గురువారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు వినగడప పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్టోన్ క్రషర్స్ వద్ద నిర్వహించే కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా డీఆర్ఓ కె మోహన్‌కుమార్ పాల్గొని ప్రజాభిప్రాయం సేకరిస్తారని పేర్కొన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశానుసారం స్టోన్ క్రషర్స్ చుట్టు పక్కల గ్రామాలైన కనుమూరు, అనుముల్లంక, వినగడప, కొత్తపల్లి, తెలంగాణ రాష్ట్రం గోపవరం తదితర గ్రామాల్లో మైక్ ద్వారా ప్రచారం చేశామని తెలిపారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముసునూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. ఆమె బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముసునూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సర్వసభ్య సమావేశానికి సభ్యులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడిని కృష్ణలంక పోలీసులు రక్షించారు. సేకరించిన వివరాల మేరకు మన్యం జిల్లా పార్వతీపురంమండలంలోని సాలూరుకు చెందిన ఎం.ఎ.ఎల్.ప్రసాద్ నగరంలో ఉంటూ నాగార్జున యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్నాడు. చదువు కొనసాగించడం ఇష్టంలేని ప్రసాద్ తల్లిదండ్రుల ఒత్తిడితో చదువుతున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి రైల్వే బ్రిడ్జి పై నుంచి కృష్ణా నదిలోకి దూకేందుకు యత్నించాడు. సమాచారం అందుకున్న సీఐ ఎం.వి.దుర్గారావు వెంటనే అప్రమత్తమై కానిస్టేబుల్ రాములు, ఇతర సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి యువకుడిని రక్షించారు. స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.










జలక్రీడల్లో శిక్షణ

పున్నమి ఘాట్ సమీపంలో శాప్ ఆధ్వర్యాన చిన్నారులకు వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో బుధవారం సూమారు 50 మంది పైగా పాల్గొన్నారు. కయాకింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్న దృశ్యాలను సాక్షి క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆసరా నగదు అన్ని సంఘాల ఖాతాల్లో జమ

ఆగిరిపల్లి: వైఎస్సార్ ఆసరా నగదు మండలంలోని అన్ని డ్వాక్రా సంఘాల గ్రూపుల ఖాతాల్లో జమ అయినట్లు, ఆ నగదును సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లోకి కూడా ఆయా బ్యాంకుల నుంచి జమయ్యాయని వెలుగు ఏపీఎం బి.రామకృష్ణ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం వీఓఏలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ స్త్రీనిధి, హౌసింగ్ నిర్మాణాలకు రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఆసరా నగదు 1234 సంఘాలకు గాను, రూ.12.50 కోట్లు జమ అయినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఏపీఎం రామకృష్ణ

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆగిరిపల్లి: మండలం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడిగా ఆసానుబాదు చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడిగా కొల్లూరి ఐజక్ జాన్, ఉపాధ్యక్షుడిగా సంగా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ షఫీవుల్లా, కోశాధికారిగా నంజం శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా ముగ్గురిని, మరో ఇద్దరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.